విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 30 అక్టోబరు 2025 | 8 పేజీలు

వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్‌కు గండి

గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి 11 గేట్లు ఎత్తివేత

జలదిగ్బంధంలో గ్రామాలు

పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు

రాకపోకలకు తీవ్ర అంతరాయం

వేలాది హెక్టార్లలో పంటలు నష్టం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

నీట మునిగిన శివారు ప్రాంత కాలనీలు

పునరావాస కేంద్రాలు కొనసాగింపు

2లో

అంతా జలమయం

-విశాలాంధ్ర బ్యూరో, ఒంగోలు

గుండ్లకమ్మ ప్రాజెక్టును కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలన

- 11 గేట్లు ఎత్తి 13 వేల క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల
- ముంపు గ్రామాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలి
- వరద నీటిపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి సుమారు లక్షా 13 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్. పి.రాజాబాబు తెలిపారు. ఈ దృష్ట్యా దిగువన పరివాహక ప్రాంతంలో ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సంత నూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ .జయంత్ బాబుతో కలిసి బుధవారం గుండ్లకమ్మ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం, నీటిని దిగువకు విడుదల చేస్తున్న తీరు, పరివాహక ప్రాంత ప్రజలను, రైతులను అప్రమత్తం చేసిన విధానం, ప్రాజెక్టు వద్ద సందర్శకులను నియంత్రించేందుకు చేపట్టిన మిగతా 2 లో ...

ముంచెత్తిన మొంథా

- బాపట్ల జిల్లాలో పెను గాలులు, వర్ష భీభత్సం
- పొంగిన వాగులు, తెగిన రోడ్లు
- చలి గాలులకు ఇరువురు మృతి
- 25 మందిని రక్షించిన రెస్క్యూ టీమ్
- పంటలు వర్షార్పణ
- ఆందోళనలో ప్రజలు
- జిల్లాలో మంత్రులు కొలుసు, గొట్టిపాటి పర్యటన

విశాలాంధ్ర బృందం - బాపట్ల జిల్లా :

మొంథా తుఫాన్ బాపట్ల జిల్లాను ముంచెత్తింది. తుఫాను తీరందాటే సమయంలో పెనుగాలులతో విధ్వంసం సృష్టించింది. భీకరమైన గాలులు వర్షం దాటికి భారీ వృక్షాలు విద్యుత్తు స్థంబాలు నేలవాలాయి. జిల్లాలోని వాగులు వంకలు ఉధృత్తంగా ప్రవహిస్తున్నాయి.

వంతెనలు కాలువలు తెగిపోవటంతో జనజీవనం స్థంభించిపోయింది. పలు ప్రాంతాల్లో ఇళ్లు కూలిపోగా మరోవైపు పశువుల చావిడిలు నేలమట్టమవటంతో పశువులు మృతి చెందాయి. చలిగాలుల ప్రభావంతో అద్దంకి నియోజకవర్గంలో ఇరువురు మృత్యువాత చెందారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షంలో చిక్కుకున్న 25 మందిని ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీస్, రెవిన్యూ బృందాలు కాపాడారు. బాపట్ల సూర్యలంకలో సముద్రం అల్లకల్లోలంగా మారి అలలు ఎగిసి పడి నీరు ముందుకు రావటంతో పోలీస్ వాచ్ టవర్ కుంగిపోయింది. బీచ్‌కు వెళ్లే దారిలో వంతెనపై మిగతా 2 లో ...

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి

2లో

నాగులుప్పలపాడు.. అతలాకుతలం

- ఉధృతంగా దోర్నపు వాగు
- రాకపోకలు బంద్
- పొంగిన వాగులు
- నేలకొరిగిన చెట్లు

3లో

అంతా జలమయం

- ఒంగోలులో పొంగి ప్రవహించిన పోతురాజు కాలువు
- ట్రాక్టర్ ద్వారా కాలువను పరిశీలించిన కలెక్టర్
- ముంపు గ్రామాలు, పునరావాస కేంద్రాలను పరిశీలించిన మంత్రి డోలా, ఎమ్మెల్యేలు
- నేడు జిల్లాకు వర్ష సూచన
- సహాయక చర్యల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : మొంథా తుఫాన్ జిల్లాను ముంచెత్తింది. ప్రకాశం జిల్లా అంతా జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. నేటికీ వందలాది గ్రామాలు జలమయమై ఉన్నాయి. శివారు ప్రాంత కాలనీలు నీట మునిగి ఇళ్లల్లోకి నీరు వచ్చాయి. పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్‌కు గండి పడింది. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఉన్న 250 మంది కార్మికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మరో పక్క ఒంగోలు సమీపంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టుకు వరద ఉధృతి బాగా పెరిగింది. దీంతో 11 గేట్లు ఎత్తి 13 వేలు క్యూసెక్కుల నీటిని సముద్రానికి వదులుతున్నారు. ప్రాజెక్టు ముంపు గ్రామాలు 13కు పైగా జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. గత 50 సంత్సరాల నుంచి గండ్లు పడని చెరువులకు సైతం మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గండ్లు పడ్డాయి. దీంతో ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో ఒంగోలులోని పోతురాజు కాలువ ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో 18 శివారు ప్రాంత కాలనీలు నీట మునిగాయి. జిల్లా కలెక్టర్ రాజబాబు సైతం కాలనీ వాసులను చూసేందుకు ట్రాక్టర్‌లో రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెద్ద పెద్ద చెరువులకు గండ్లు పడటం, కాలువలకు నల్లవాగు ఉధృతంగా ప్రవహించడంతో అనేక గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్లపై నీటి ప్రవహిస్తున్న వద్ద పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. రోడ్లపై ఇరిగిపడిన చెట్లు, కరెంటు స్తంభాలు, విద్యుత్ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది వాటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎక్కడికక్కడ జనాలు నీటిలో కొట్టుమిట్టాడుతున్నారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో అనేక మంది తల దాచుకున్నారు. వీరికి అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు ఆహార సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రి డోలా, ఒంగోలు ఎమ్మెల్యే జనార్ధన్ కలెక్టర్‌తో కలిసి ఒంగోలును సందర్శించారు. కేంద్రీయ విశ్వ విద్యాలయంలో వర్షపునీరు వచ్చి చేరడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారిని వారి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు. హాస్టల్ వసతి గృహాల్లో నీరు చేరడంతో వారిని ఇళ్లకు పంపించారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు పోతురాజు కాలువ ప్రవాహంతో నీట మునిగింది. పోతురాజు కాలువకు సరైన మరమ్మతులు చేయకపోవడం ప్రతిసారి చిన్నపాటి వర్షానికి కూడా పోతురాజు కాలువ ప్రభావం కన్పిస్తుందేడి. ఈసారి మొంథా తుఫాను వలన జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో చెరువులకు, కాలువలకు గండ్లు పడటంతో ఆ నీరంతా సముద్రంలో కలిసేందుకు ఒంగోలు వైపు మళ్లాయి. దీంతో పోతురాజు కాలువ ఒక్కసారిగా పొంగి నగరంవైపుకు దూసుకొచ్చాయి. దీంతో చంద్రయ్య నగర్, సత్యనారాయణపురం, ఆర్టీసి బస్టాండ్, అద్దంకి బస్టాండ్, బిలాల్‌నగర్, బలరాం కాలనీ, కేశరాజుకుంట, భరత్‌నగర్ ఇలా అనేక కాలనీలు జలదిగ్బంధంలో ఇరుక్కుపోయాయి. ఇళ్లలో నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు జనం బయటకు వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. దీనికి తోడు విద్యుత్ అంతరాయం ఫలితంగా మొంథా తుఫానుతో జనం అల్లాడిపోయారు. మరోపక్క వేలాది హెక్టార్లలో పంటనష్టం వాటిల్లింది. ప్రత్తి, జొన్న, మిరప, మినుము, మొక్కజొన్న, పంటలతో పాటు అరటి, బొప్పాయి తోటలు కూడా భారీ నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనా వేయాలన్నా పొలాల్లో నీరు తగ్గితే తప్ప అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. నేడు, రేపు జిల్లాకు వర్ష సూచన చెప్పడంతో పునరావాస కేంద్రాలను కొనసాగిస్తున్నారు. ముంపు గ్రామాలను పునరావాస కేంద్రాలను అటు అధికార యంత్రాంగంతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు సేవా కార్యక్రమాల్లో పాల్గొని తక్షణ సహాయక చర్యలతో పాటు భోజన సదుపాయాలు కూడా సమకూరుస్తున్నారు.

మొంథా ముంచెత్తింది

(మొదటిపేజీ తరువాయి)

నీరు ఉధృక్తంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు వెళ్లటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామశ్వేర్ జిల్లాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రమాద ప్రాంతాల్లో సహాయ చర్యలు ముమ్మరం చేశారు. కలెక్టర్ ప్రధాన వాగులు పరిశీలించి యంత్రాగాన్ని అప్రమత్తం చేశారు. చీరాల నియోజకవర్గంలో ప్రధాన రహదారులన్నీ కాలువలను తలపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా బాపట్ల, రేపల్లె, వేమూరు, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజక వర్గాల్లో పత్తి,జూటు, మొక్కజోన్న, వరి, మినుము, వేరుశనగ, మిర్చి, అరటి, పసుపు, కంద, పంటలు తీవ్ర నష్టం జరిగింది. జిల్లా ఇంచార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి, విద్యుత్తు శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్,ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, వేగేశన నరేంద్రవర్మ పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితు లను అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ బాపట్ల జిల్లాను అతలాకుతలం చేయ టంతో రైతులు, ప్రజలు కోలుకోవటం కష్టంగా మారనుంది.

గుండ్లకమ్మ ప్రాజెక్టును కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలన

(మొదటిపేజీ తరువాయి)

భద్రత చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అప్పటికప్పుడే పరివాహక ప్రాంత మండలాల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల వలన చెరువులు పూర్తిస్థాయిలో నిండాయని, వాగులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయని చెప్పారు. ఈ క్రమంలోనే ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వలన గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం పెరిగిందన్నారు. పైనుంచి వస్తున్న ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. మొంథా తుఫాను వలన జిల్లాలో ఒకటి రెండు పశువులు చనిపోయాయి తప్ప ఎలాంటి మానవ నష్టం జరగలేదని కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన హెచ్చరికలు, సూచనలను పాటించి ప్రజలు సహకరించినందువలనే ప్రమాదం జరగలేదన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మ నుంచి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేస్తున్నందున పరివాహక ప్రాంత ప్రజలు కూడా అధికార యంత్రాంగం చేసే సూచనలను, హెచ్చరికలను పాటించాలని ఆయన కోరారు. శాసనసభ్యులు విజయకుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నందున క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలపై ఉన్నతాధికారులతో చర్చించామన్నారు. గ్రామస్థాయిలో వీఆర్వోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేసినట్లు తెలిపారు. మరో రెండు రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు. ఈ

సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు ఎస్.ఈ. అబూత్ అలీమ్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, మండల స్పెషల్ ఆఫీసర్ అయిన మార్కెటింగ్ ఏ.డీ. వరలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి, తహసిల్దార్ ఆదిలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సహాయక చర్యలపై అధికారులతో మాట్లాడిన ఎంపీ మాగుంట

స్పెయిన్ పర్యటనలో ఉన్న ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మొంథా తుఫాన్ తాకిడి ప్రాంతాలలో ప్రజలకు కావలసిన అన్ని సహాయక చర్యలతో పాటు ముఖ్యంగా నీటి మరియు విద్యుత్ సమస్యలు తీర్చడం గురించి జిల్లా మంత్రి, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తోను, ఒంగోలు శాసనసభ్యులు, దామచర్ల జనార్ధన్ రావు తోనూ మరియు జిల్లా కలెక్టర్, రాజా బాబు గారితో ఫోనులో మాట్లాడి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవలసినదిగా కోరినారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మరియు మంత్రివర్యులు నారా లోకేష్ తుపాను ప్రభావంతో ఎలాంటి ఇబ్బందులు ప్రజలు పడకుండుటకు అన్ని సహాయ చర్యలపై ఎప్పటికప్పుడు సంబందిత శాసన సభ్యులకు మరియు అధికారులకు ఆదేశాలు ఇచ్చుచున్నారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్ధసారధి

విశాలాంధ్ర - కొల్లూరు : మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్ధసారధి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన కొల్లూరు మండలపరిధిలోని రావికంపాడు అడ్డరోడ్డు వద్ద తుపాను కారణంగా నేల వాలిన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో తుపాను బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మొంథా తుపాను దాటికి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు ప్రభుత్వం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో శక్తి వంచన లేకుండా కృషి చేసి విజయం సాధించిందన్నారు. తుపాను ఆరంభం నుంచి ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం ద్వారా ప్రజలకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా కాపాడగలిగామన్నారు. సీఎం చంద్రబాబు టెక్నాలిజీని సమర్ధవంతంగా వినియోగించి ప్రజలను అప్రమత్తం చేయడంతో ముందుగానే తుపాను జాగ్రత్త చర్యలు రాష్ట్రంలోని ప్రజలు తీసుకోగలిగారన్నారు. ప్రకృతి విపత్తులు ఎవ్వరి చేతులలో ఉండేవి కాదుకనుక తుపాను కారణంగా డెల్టా ప్రాంతంలో తీవ్ర పంట నష్టం వాటిల్లిందన్నారు. వేలాది ఎకరాలలో కోత దశకు వచ్చిన వరి పంట దెబ్బతినడంతోపాటు, వాణిజ్య పంటలకు సైతం తీవ్ర నష్టం వాటిల్లడం బాధాకరమైన అంశమన్నారు. తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతాంగానికి ప్రభుత్వం తప్పనిసరిగా అండగా నిలుస్తుందన్నారు. తక్షణం పంట నష్ట నమోదు బృంధాలను ఏర్పాటు చేసి పంట నష్ట అంచనాలు రూపొందించి నిబందనల ప్రకారం రైతులకు పరిహారం అందజేస్తామన్నారు. నీటిని బయటకు మళ్లించగలిగితే పంట నష్టాన్ని కొంత మేర తగ్గించ వచ్చునన్న రైతుల సూచనల మేరకు ఆయన డ్రైనేజ్ శాఖ అధికారులను తక్షణం డ్రైన్లలో నీరు సవ్యంగా పారుదల అవడానికి పనులు చేపట్టాలని ఆదేశించారు. తూటికాడ తొలగింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేయడం ద్వారా రైతులకు నష్టం అధికమవ్వకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మేలు చేకూరుస్తుందన్నారు.

తుపాను కారణంగా ఏర్పడిన నష్టాన్ని పూడ్చలేకపోయినప్పటికీ, ప్రభుత్వ నిబంనదల మేరకు రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేకాధికారి నాగిరెడ్డి, తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కె.నర శింహారావు, మాజీ ఎంపీపీలు మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదన్ ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో సుందరయ్య కాలనీ

నిత్యవసర సరుకులు అందించాలని వేడుకోలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని జమ్మలమడక పంచాయతీలోని సుందరయ్య కాలనీ ఈదర వాగు పొంగడంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. గత మూడు రోజులుగా కురుస్తున్న ముంతా తుఫానుకు ఈదర వాగు పొంగి సుందరయ్య కాలనీలోకి నీరు చేరడంతో కాలనీ నుండి బయటకు రావడానికి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లల్లోనే నిత్యావసర వస్తువులు, కట్టెలు, బట్టలు, తడిచిపోవడంతో తినడానికి ఏమీ లేక అల్లాడుతున్నామని అధికారులు స్పందించి నిత్యవసర సరుకులు అందించాలని వేడుకుంటున్నారు. అదేవిధంగా మండలంలో పలు గ్రామాలలో వరి, మొక్కజొన్న, మిరప, బొప్పాయి తోటలు నీటిలో మునిగాయని రైతులు తెలుపుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి నీట మునిగిన పొలాలను పరిశీలించి నష్టపరిహారం అంచనా వేసి నష్టపరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

భారీ వర్షాలకు నిండిన చెరువులు

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువులు నిండగా, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా కోనపల్లి, ఖాజీపురం, పిటికాయగుల్ల, చెరువులు నిండి అలుగులు పారాయి. ఎంపీచెరువు, బసినేపల్లి గ్రామాల మధ్య వున్న పీతురు వాగు, బేస్తవారిపేట, ఒంగోలు జాతీయ రహదారిలోని పాపాయిపల్లి వాగు, చిన్న కంభం వెళ్లే మార్గంలోని ఉప్పు వాగు, బార్లకుంట సమీపంలోని పొగుళ్ల వాగులు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. దీంతో ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో వర్షపు నీరు ముంచెత్తడంతో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల ప్రత్యేకాధికారి పానకాలరావు, తహశీల్దార్ ఎ.జితేంద్ర కుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు తమ సిబ్బందితో కలిసి ఉధృతంగా ప్రవహిస్తున్న ఆయా చెరువులను, వాగులను, వర్షపు నీరు చేరిన గ్రామాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సిబ్బందిని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

శాంతించిన వరుణుడు

- ఉధృతంగా దోర్నపు వాగు
- రాక పోకలు బంద్
- పొంగిన వాగులు
- నేలకొరిగిన చెట్లు
- మునిగిన పంటలు

విశాలాంధ్ర -తాళ్లూరు : మొంథా తుఫాన్ తీరం దాటటంతో ఎట్టకేలకు బుధవారం ఉదయం వాతావరణం తెరపి ఇచ్చినది. ఎట్టకేలకు రెండు రోజుల తర్వాత ఎండ చూడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ ప్రభావానికి తోడు వరుసగా ముందు ఆరు రోజుల పాటు భారీ వర్షాలు తోడు అవటంతో గత పదేళ్లలో ఉధృతంగా వాగులు పొంగి రాక పోకలు బంద్ అయ్యాయి. తుఫాన్ ప్రభావంతో మండలంలో 197.0 మి.మీల వర్షపాతం నమోదు కాగా గత వారంలో భారీ వర్షాలతో మొత్తం వర్షపాతం 245.0 మి.మీలుగా మారింది. దీంతో తాళ్లూరు-విఠలాపురం, లింగాల పాడు- మన్నేపల్లి, దారం వారి పాలెం - తూర్పుగంగవరం, దోసకాయల పాడు- తోట వెంగన్న పాలెం, తాళ్లూరు-రజానగరం, తాళ్లూరు కుంకుపాడు మధ్య రాక పోకలు నిలిచి పోయాయి. వాగు పొంగినట్లయితే ప్రత్యామ్నాయంగా మన్నేపల్లి హై లెవల్ బ్రిడ్జి ద్వారా ముండ్లమూరు వైపు రాక పోకలు సాగించే అవకాశం ఉండేది. కాని హై లెవల్ బ్రిడ్జి కూడ పొంగి ప్రవహిస్తున్నది. దీంతో పోలీసులు ఆయా మార్గాల్లో ఎస్సై మల్లిఖార్జున రావు అధ్వర్యంలో బందోబస్తు చేపట్టి పూర్తి స్థాయిలో రాక పోకలు నియంత్రించారు.

వరద ఉధృతికి నీట మునిగిన వరి పొలాలు..జల దిగ్బంధంలో గ్రామాలు

వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో పాటు పంట పొలాలు నీట మునిగాయి. పలు గ్రామాలలో కోతకు వచ్చిన వరి పొలాలు నీట మునిగాయి. మొక్కజొన్న, బొబ్బాయి పంటలు నెల కొరిగాయి. మొక్కజొన్నతో పాటు పలు పంటలను వ్యవసాయాధికారి ప్రసాద రావు పరిశీలించి సస్యరక్షణ చర్యలను సూచించారు.

డిప్యూటీ స్పెషల్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి ఎ.కుమార్, ఎంపీడీఓ అజిత, తహసీల్దార్ రమణా రావు, ఎస్సై మల్లిఖార్జున రావులు నిరంతరం తమ సిబ్బందిని అప్రమత్తం చేసి ఎక్కడికక్కడ చర్యలు చేపట్టటంతో పెను నష్టం తప్పినట్లయినది. తోట వెంగన్న పాలెంలో రోశమ్మ, ఆదెమ్మ నివాసాలలోనికి నీరు వచ్చాయి. దోర్నపు వాగు పొంగటంతో దారం వారి పాలెం, తోట వెంగన్న పాలెం జల దిగ్బంధంలో చిక్కుకున్నది. దోసకాయల పాడు- బెల్లంకొండ వారి పాలెం మధ్య వాగు పొంగటంతో ఆయా గ్రామాలకు రాక పోకలు నిలచాయి. దర్శి వైపు ప్రయాణంచేయటానికి తూర్పు వీరాయపాలెం వద్ద వాగు పొంగటంతో రాక పోకలు నిలిచాయి. తాళ్లూరు నుండి దర్శి, ముండ్లమూరు, అద్దంకి వైపు రాక పోకలు నిలచి పోయాయి.

సహాయక చర్యలు పర్యవేక్షించిన ప్రజా ప్రతినిధులు

దోర్నపు వాగు పొంగటంతో ఆయా గ్రామాలకు రాక పోకలు నిలిచి పోవటంతో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకట రెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వర రెడ్డి, స్థానిక నాయకుడు ఇడమకంటి శ్రీనివాస రెడ్డిలు ఆయా గ్రామాలలో వాగుల పరిస్థితిపై ఆరా తీసారు. దోర్నపు వాగు వద్ద ఉధృతిని పరిశీలించి అధికారులను అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వాగులను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న బేస్తవారిపేట- ఒంగోలు జాతీయ రహదారిలోని పాపాయిపల్లి పీతిలేరు వాగు, చిన్న కంభం వెళ్లే మార్గంలోని ఉప్పు వాగు, చీతిరేల కత్తువ వాగులను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి బుధవారం పరిశీలించారు. రెవిన్యూ అధికారులు వాటి పరిస్థితిని గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి పానకాలరావు, తహశీల్దార్ ఎ. జితేంద్ర, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాలను ఎమ్మెల్యే 'ఉగ్ర' పరిశీలన

విశాలాంధ్ర -వెలిగండ్ల : మండలంలోని పులికుంట్ల , రాళ్ళపల్లి గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న సజ్జ పంటను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. గత మూడు రోజులనుండి కురిసిన వర్షాలకు కోత దశలోఉన్న సజ్జ పంట గింజలు ఉబ్బడం, బూజు రావడం, నల్లగా మారడం కంకిలో గింజలు మొలకెత్తాయి మండే వేసిన కంకులు సైతం మొలకలు వచ్చి గింజలు నల్లగా మారాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో ప్రాథమికంగా సుమారు 3665 ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లుగా నివేదికను జిల్లా వ్యవసాయ కార్యాలయాల అధికారులకు తెలియజేశామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కె.అర్జున్ నాయక్, సహాయ వ్యవసాయ సంచాలకులు కనిగిరి షేక్ జైనులాబ్దీన్, మండల తహశీల్దార్ వాసు, మండల అభివృధి అధికారి షేక్.మహబూబ్ భాష, మండల వ్యవసాయ అధికారిని తమ్మినేని శిల్ప మండల రైతు అధ్యక్షులు కేసరి రమణ రెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులు కెవి బ్రహ్మం ,స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలు - అపార నష్టం

విశాలాంధ్ర - గిద్దలూరు : ఆరుగాలం కష్టించి పనిచేసే రైతుకు మరో తుఫాను రూపంలో పంటలు నీట మునిగి అపార నష్టం జరిగింది. గత రెండు రోజులుగా కురుస్తున్న తుఫాను తాటికీ మండలంలోని చెరువులు కుంటలు పొరుతున్నాయి ఏ నేపథ్యంలో ప్రధాన పంట అయిన పత్తి మిరప పొగాకు పంటలు పూర్తిగా నీటి మునిగి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. 617 హెక్టార్ల పత్తి పంట దెబ్బతిన్నట్టు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా కేసు పల్లి వెంకటాపురం కొమ్మునూరు వేములపాడు పొదలకుంటపల్లె తదితర గ్రామాల్లో వర్ష ప్రభావంతో పొలాలు నీట మునిగాయి. పత్తి పూర్తి స్థాయిలో దెబ్బతినగా మిరప టమోటా ఇటువంటి వేసిన బంతిపూల తోటలు వల్ల పంటలు కోల్పోయినట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు వివరణ కోరగా కొమ్మునూరు, సంజీవరావుపేట, ఓబులాపురం, గడికోట, ఉయ్యాలవాడ, ముండ్లపాడు, కొత్తకోట, వెళ్ళుపల్లి, అంబవరం గిద్దలూరు రైతు సేవా కేంద్రాల పరిధిలో పత్తి పంట వివిధ దశలలో పూత దశ నుండి పత్తి తీసే దశ వరకు మొత్తం 617 హెక్టార్లలో ఉన్నది. వెంటనే పొలాలలోని నీరును బయటకు పోయే విధంగా దారులు చేసుకోవాలని, 2శాతం యూరియ లేదా పోటాషియం నైట్రేట్ లేదా 19:19:19, 1శాతం మెగ్నిషియం సల్ఫేట్, 5 గ్రాములు బోరక్స్ లీటర్ నీటికి వారం వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలని తెలియ జేయడం జరిగింది. 33శాతం కన్నా ఎక్కువ నష్టపోయిన వారి జాబితా గవర్నమెంట్‌కి పంపి నష్ట పరిహారం వచ్చే విధంగా చూస్తామని మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.

దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి పరిశీలన

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలో మొంథా తుఫాన్ ధాటికి కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 1060 హెక్టార్లలో మొక్కజొన్న, పత్తి, సజ్జ, వరి పంటలు దెబ్బ తిన్నట్లు తెలిపారు. ప్రాథమిక పంట నష్ట నివేదికలను పై అధికారులకు పంపించడం జరిగిం దన్నారు. తుఫాన్ తర్వాత పంట చేలల్లో నీరు నిల్వ ఉండకుండా బయటికి వెళ్లే మార్గాలు ఉన్నచోట నీరు బయటికి వెళ్ళ పెట్టాలని తెలిపారు. పత్తి పంటలో 13-

0-45 ఎరువును ఎకరానికి ఒక కేజీ చొప్పున పై పాటుగా పిచికారి చేసుకోవాలని సూచించారు.

నాగులుప్పలపాడు..అతలాకుతలం

- నీటమునిగిన పొలాలు
- వరదనీటిలో చిక్కుకున్న గ్రామాలు
- విరిగిపడిన చెట్లకొమ్మలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మొంథా తుపాను ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలుచోట్ల చెట్లు చేమలు విరిగిపడ్డాయి. రహదారులు సైతం కోతకు గురయ్యాయి. అధికారులు ముందస్తు జాగ్రత్తలు నష్ట నివారణకు ఒకింత ఉపకరించాయి. అధ్వానంగా ఉన్న డ్రైనేజీ ప్రభావంతో పలు గ్రామాల్లో జలదిగ్బంలో చిక్కుకున్నాయి. మండలంలోని మేజర్ పంచాయతీ అయిన ఉప్పుగుండూరులోని ఎస్సీ కాలనీలు, పరబీడు కాలనీలలో ఇళ్లలోని నీరు చేరింది. ఊరచెరువు అలుగుపారి నీరు రహదారులపైకి వచ్చింది. ఎం.ముప్పాళ్ల, మట్టిగుంట, ఈదుమూడి తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. బి.నిడమూనూరు, రాపర్ల, మాచవరం, కొత్తకోట, తదితర గ్రామాలను వాగులు చుట్టుముట్టడంతో ప్రజలు అడుగుతీసి బయట పెట్టలేక పోయారు. మండలంలోని కొత్తకోటవాగు, ఉప్పుగుండూరులోని నాగన్నవాగు, మట్టిగుంటవాగు, ఈదుమూడి వాగులు పొంగి జనావాసాలు, పంటపొలాలపై నుంచి ప్రవహించాయి. వర్షం ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోగా, బుధవారానికి పునరద్ధరించారు.

జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు :

చదలవాడ సమీపంలోని 216 జాతీయ రహదారిపైకి చెరువునీరు ఏటా మాదిరిగానే రాకపోకలు స్తంభించాయి. దీంతో వాహనాలు గ్రామంలోని రాకపోకలు సాగించాయి. అధికారుల ఒత్తిడితో జాతీయ రహదారి అధికారులు తక్షణం నీటి మళ్లింపు పనులు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూశారు.

దెబ్బతిన్న పొలాలు : ఇక మండలంలో ఇప్పటికే సాగులో ఉన్న పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరి చేలలో నీరు నిలిచింది. మొక్కజొన్న పైరు పూర్తిగా నేలకొరింది. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. మరోవైపు మిరప రైతులకు అపారనష్టం వచ్చింది. మళ్లీ మొక్కలు నాటుకోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-కంభం : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పట్టణం లోని పలు వీధుల్లో రోడ్ల పై నీరు చేరి గృహాలవారికి, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం రాత్రి ఎడతెతిపి లేకుండా కురిసిన వర్షానికి అగ్ని మాపక కేంద్రం ఆవరణలో ఉన్న చెట్టు నిత్యం రద్దీ గా ఉండే రోడ్డు కు అడ్డంగా ఎదురుగానున్న ఇంటి పై కూలింది, .దింతో అక్కడ ఉన్న గృహాలవారు భయబ్రాంతులతో రోడ్డు పైకి వచ్చి కేకలు వేయడం తో అక్కడేఉన్న ఫైర్ సిబ్బంది వచ్చారు .తృటిలో ప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం ఉదయం కందులాపురం గ్రామా పంచాయతి సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది కలసి చెట్టును నరికి తొలగించారు.

కనిగిరి,కందుకూరుకి వాహనాల రాకపోకలు బంద్

విశాలాంధ్ర-పిసీపల్లి : తుఫాన్ ప్రభావంతో పిసీపల్లి మండలంలో కురిసిన వర్షాలతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండి మొరవలు పారుతున్నాయి. పాలేటిపల్లి రిజర్వాయర్ పూర్తిగా నిండి అలుగు పారుతుంది. మండలంలోని వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో చెరువులకు భారీగా నీరు చేరుతోంది. పొన్నలూరు మండలంలోని పొన్నలూరు చెరువు నిండడంతో రెడ్డిపాలెం వాగు పొంగి పొర్లతు ఒడడంతో కనిగిరి కందుకూరు ప్రధాన రహదారిలోని వాహనాల రాకపోకలు మంగళవారం సాయంత్రం నుండి స్తంభించాయి. దీంతో అధికారులు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. తుఫాను ప్రభావంతో మండలంలోని పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. అధికారులు అప్రమత్తం అవడంతో ప్రాణ ఆస్తి నష్టం జరగలేదు. మండలంలోని పలు రకాల పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. పెట్టుబడి పెట్టిన రైతులు పంటలు దెబ్బ తినడంతో లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 మంది వలస కూలీలని పునరావాస కేంద్రానికి తరలించిన సీఐ

విశాలాంధ్ర-పామూరు : తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున మండలం లోని పడమట కట్ట కింద పల్లి గ్రామ సమీపంలోని వాగు ఉదృతంగా ప్రవహిస్తున్నది. నెల్లూరు జిల్లాకు చెందిన పదిహేను మంది వలస కూలీలు వాగుకు అవతలి వైపు దిక్కు తోచక అక్కడే ఉన్నారని సమాచారం తెలుసుకున్న పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం బీమా నాయక్ హుటా హుటీన అక్కడికి ట్రాక్టర్ తో చేరుకొని వారిని పడమట కట్టకిందపల్లి ప్రభుత్వ పాఠశాలలోని పునరావస కేంద్రానికి తరలించారు. సిఐ వెంట పామూరు ఎస్ఐ టి.కిషోర్ బాబు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ పునరావాస కేంద్రానికి చేరుకొని పోలీసులను అభినందించారు

నల్లమల అడవి అందాల నడుమ ప్రకృతి సోయాగాల పాలంక జలపాతం

పాలుట్లను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటూ కోరుతున్న ప్రజలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : దట్టమైన పచ్చని నల్లమల అడవి అందాల నడుమ ప్రకృతి సోయగాలతో ఆకట్టుకునే జలపాతం పాలుట్ల పాలంక జలపాతం. ఈ జలపాతం ప్రకృతి సోయగాలలో ఒకటి. ఇది యర్రగొండపాలెం మండల కేంద్రానికి సమారు 40కి. మీ దూరంలో పాలుట్లకు దాపులోని కారడవిలో నెలకొని ఉన్న చారిత్రక పాలంకస్వామీ ఆలయం దగ్గర ఈ జలపాతం ఉంది. ఇది ఎత్తైన కొండల నుండి నీరు కిందకి దూసుకుని వచ్చే అందమైన దృశ్యం ఈజలపాతం. ఈ జలపాతం అందాలు చూస్తే మాత్రం మైమరచి పోవాల్సిందే. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ జలపాతం ప్రకృతి సోయగాలతో కళ్ళను కట్టిపడేసే అద్భుతం నలమలలో అత్యంత ఎత్తయిన పాలంక జలపాతం. ఇది దాదాపుగా 400 అడుగుల ఎత్తునుంచి జాలువారుతుంది. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో పాలనురుగుతో కూడి పొగ మంచులను తలపిస్తూ ఆ దిగువన కొలువు దీరిన పాలంక వీరభద్రుడిని అభిషేకిస్తూ ఆ నీరంత కిందనున్న గుండాని చేరవేసే జలపాతం. ఈ జలపాతం ఎడాదికి ఒకమారు జరిగే పాలంక తిరునాళ్ళు భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ జలపాతంలో నుంచి జాలువారి గుండానికి చేరిన నీటిలో తడిసి ముద్దవ్వండం కోసమే భక్తులు తండోప తాండాలుగా తరలి వస్తారు. పాలంక జలపాతం వద్దకు చేరుకోవాలంటే అంతసులభం కాదు. ఎత్తుపల్లం నుంచి 5 కిలోమీటర్లు కొండప్రాంతం దిగుతూ కిందకు నడక సాగించాల్సి ఉంటుంది. రెండు, మూడు గంటలు కొండలు, గుట్టలు దాటుకుంటు కిందకు చేరుకోవచ్చు. కిందనుంచి రెండు పర్వతాల మద్యనుంచి జాలువారే నీటి ప్రవాహం చూడముచ్చటగా ఉంటుంది. యర్రగొండపాలెం నుంచి పాలుట్లకు రహదారిని నిర్మించి అడవిలోని ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెయాలని ప్రక్రృతి ప్రేమికులు పాలంక వీరభద్రస్వామి భక్తులు, పాలుట్ల పంచాయితీ గిరిజనులు కోరుతున్నారు.

గంగమ్మ తల్లికి పూజలు

విశాలాంధ్ర -కంభం : ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కంభం చెరువు అలుగువద్ద గంగమ్మ తల్లికి పసుపు ,కుంకుమ నీటిపై చల్లి పూజలు నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిద్దలూరు నియోజక వర్గంలో ఉన్న చెరువులన్నీ తుఫాన్ ప్రభావంతో చెరువులన్నీ నిండాయని అన్నారు. మొంత తుఫాన్ ప్రభావంతో కొన్ని ప్రాంతాల కు నష్టం జరిగిందని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కంభం చెరువు అలుగు ఒక్కఅడుగు మేర నీరు అలుగు పైనుంచి పారుతుంది .కూటమి ప్రభుత్వం లో ముఖ్య మంత్రి అన్ని వర్గాల వారికీ, ముఖ్యం గా మహిళలకు పలు పతకాలు ప్రవేశ పెట్టి అమలుచేశారని పేర్కొన్నారు. పర్యాటక కేంద్రంగా చర్యలు ముఖ్య మంత్రి అనుమతితో కంభం చెరువుకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట సబ్ కలెక్టర్ శివరామయ్య, తహసీల్దార్ సురేష్ ,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ దాటికి పొంగి పొర్లుతున్న వాగులు

- జనజీవనం అస్తవ్యస్తం
- నిలిచిన రాకపోకలు
- బొగ్గు బట్టి కార్మికులకు ఆశ్రయం కల్పించిన అధికారులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముంతా తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు వాగులు పొంగిపొర్లుతున్నాయి. ప్రధానంగా దర్శి అద్దంకి ప్రధాన రహదారిలో వేంపాడు ముండ్లమూరు గ్రామాల మధ్యగల చిలకలేరు వాగు పులిపాడు, ఉల్లగల్లు, వేముల, చింతలపూడి, ఈదర, సింగనపాలెం, మారెళ్ళ, ముండ్లమూరు గ్రామాల వద్ద గల వాగులు పొంగిపొర్లు తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముందుస్తూ చర్యలో భాగంగా వాగుల వద్ద రెవెన్యూ. పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేసి వాగుల వద్ద పహారా ఉండడంతో ఎలాంటి ప్రాణం నష్టం చోటు చేసుకోలేదు. దీంతో అధి కార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. వాగులు వంకలు పొంగిపొర్లుతుండడంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు నానా అవస్థలు పడ్డారు. ముండ్లమూరు, వేంపాడు గ్రామాల వద్ద ఉన్న బొగ్గుబట్టి కార్మికులను గుర్తించి ముందస్తు చర్యల్లో భాగంగా హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. గ్రామాలలో గాలివానకు చెట్లు విరిగి కరెంటు తీగలు తెగిపోవడంతో సమాచారం అందుకున్న విద్యుత్ ఏఈ టి అంకబాబు తన సిబ్బందితో రాత్రి, పగలు తేడా లేకుండా వర్షం కురుస్తున్న విరిగిన చెట్లను తొలగించి విద్యుత్తు లైన్లకు మరమ్మతులు చేసి విద్యుత్తు్ను పునరుద్దించారు.

పునరావాస కేంద్రాలను సందర్శించిన జాయింట్ కలెక్టర్ భావన

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని పెనుమూడి గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న పునరావాస కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన బుధ వారం సందర్శించారు.వసతి గృహంలో ఉన్న వ్యక్తులతో మాట్లాడి సహాయ కేంద్రంలో అందుతున్న సౌకర్యాలు, ఆహార ఏర్పాట్లు, వైద్యం ఇతర విషయాల గురించి వారిని జెసి అడిగి తెలుసుకున్నారు.జెసి వెంట రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి, తాసిల్దార్ శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి అబిద్ హుస్సేన్,వీఆర్వో రామస్వామి,వీఆర్ఏలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భోజనం ఏర్పాటు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని అనంతవరం గ్రామ ఉన్నత పాఠశాలలో ఏర్పా టు చేసిన పునరావస కేంద్రంలోని ఉన్నవారికి గ్రామ టిడిపి నాయ కులు గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణలు పర్యవేక్షణ నిర్వహించారు.సుమారు 40 మందికి భోజనం,టిఫిన్లు వారు సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు.గ్రామంలోని ఎస్సీ కాలనీ,బీసీ కాలనీ,లోతట్టు ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఇక్కడ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రేపు రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 31వ తేదీ 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కే.సాంబశివరావు తెలిపారు.ఈ సమావేశంలో 19 అంశములతో ఎజెండా తయారు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.సమావేశానికి చైర్పర్సన్ కట్టమంగ అధ్యక్షత వహిస్తారని కౌన్సిల్ సభ్యులు,కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏవో

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని రేణింగవరం, ఆలవలపాడు గ్రామాలలో మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న మినుము, మొక్కజొన్న,వరి పంటలను మండల వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొలక దశ,శాఖీయ దశ మినుము పొలంలో నిలిచిన నీటిని తొలగించి ఇనుము ధాతులోప సవరణకు అన్నబేధి 50గ్రాములు 5 గ్రాములు నిమ్మ ఉప్పు 100 గ్రాముల యూరియా 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి: ఏడుకొండలు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రతి పనికి ప్రభుత్వంపై ఆధారపడకుండా చుట్టుపక్కల వారికి చేతనైనంత సహాయం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాత ఏడుకొండలు అన్నారు. బుధవారం తుఫాను కారణంగా ఇబ్బంది పడుతున్న కాలువ కట్టపై ఉన్న 50 ఎస్టీ కుటుంబాలకు చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ కందుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షులు దివి రాంబాబు,పార్టీ నాయకులు నాగుల పున్నారావు, సొంటి సుబ్బారావు,దివి శ్రీనివాసరావు, పెనుమర్తి రత్తయ్య,అందే సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో తుఫానును ఎదుర్కొన్నాం

మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర - వేమూరు : ప్రభుత్వ ముందస్తు చర్యల కారణంగానే ఎటువంటి నష్టం లేకుండా మొంథా తుఫానును దీటుగా ఎదుర్కోగలిగామని జిల్లా ఇన్‌ఛార్జి ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలియజేశారు.బుధవారం తుఫాన్ కారణంగా జంపని,కొల్లూరు గ్రామాల్లో పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులను పరామర్శించారు. అనంతరం దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫానును ఎదుర్కోవడంలో ప్రభుత్వ యంత్రాంగం పటిష్టంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు నుంచే యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని అందుమూలంగానే నష్టం లేకుండా తుఫాన్ ఎదుర్కోవడం జరిగిందని గుర్తు చేశారు.వర్షాలు కారణంగా పలు ప్రాంతాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయని అదేవిధంగా లంక గ్రామాల్లో మెట్ట పైరులు కూడా కొంత నష్టం వాటిల్లిందన్నారు.నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసు కుంటామన్నారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో బాధితులను పరామర్శించి వారికి కల్పించిన వసతులు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.వారితోపాటు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి,నియోజకవర్గ ప్రత్యేక అధికారి నాగిరెడ్డి,టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు,షేక్ అనీఫ్,లక్ష్మి దుర్గ,వాసు వివిధ శాఖల అధికారులు టిడిపి నాయకులు ఉన్నారు.

ఆపదలో ఆదుకునే దాతలు సేవకులు

ఎమ్మెల్యే మద్దులూరు మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల : తాజా వర్షాల ప్రభావంతో నీటమునిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే మద్దులూరు మాలకొండయ్య బుధవారం పరిశీలించారు. చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ పరిధిలోని బట్ట వెంకట సుబ్బారావు కాలనీలో వర్ష జలాల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను బుధవారం ప్రత్యక్షంగా పరామర్శించారు.ఈ సందర్భంగా నీటమునిగిన ఇళ్లలో నివసిస్తున్న 150 మంది నిరాశ్రయులకు బట్ట మోహన్ రావు పుష్పవల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం,వారికి అండగా నిలవడం నిజమైన సేవ అన్నారు. కుందేరు వాగు ఒడ్డున నిర్మించిన ఇళ్ల కారణంగా ప్రతి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బట్ట మోహన్ రావు,సీనియర్ టిడిపి నాయకులు సిద్ది వెంకట బుచ్చేశ్వరరావు, పంచా యతీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, పాస్టర్ రాజు,బిజెపి నాయకులు నాసిక శివాజీ, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పృథ్వి లలిత మోహ న్,ఉపాధ్యాయులు పింజల శ్రీనివాసరావు, గుత్తి పరంజ్యోతి, సీతారామయ్య పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడిన ఎస్‌డిఆర్ఎఫ్

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు వాగులో పడి కొట్టుకుపోయిన షేక్ మున్నాను డ్రోన్ సహాయంతో పర్చూరు ఎస్సై జీవి చౌదరి,సిబ్బంది, ఎస్‌డిఆర్ఎఫ్ రెస్క్యూ బృందం సహాయంతో సుమారు 500 మీటర్లు కొట్టుకుపోయిన వ్యక్తిని కాపాడా రు.ట్రైని ఎస్సై పులి గోపితో పాటు స్థానిక యువకులు యువకుడిని కాపాడటంలో సహాయ సహకారాలు అందించారు.

దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - కర్లపాలెం : తుఫాను పునరావస కేంద్రాల్లో ఉంటున్న వృద్ధులకి కర్లపాలెం మానవతా శాఖ వారు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ దుప్పట్ల పంపిణీ తూనుకుంట్ల జగదీష్ కుమార్,ఆలపాటి వెంకటరమణ,పెనుమత్స నాగవర్మ రాజు, తూనుకుంట్ల లలితబాబు వారి సహకారంతో వీటిని అందించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా నర్రావారిపాలెం,ఉర్లమ్మకాలనీ,పరిసర ప్రాంతాల్లో ఉన్న 70 మంది కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కర్లపాలెం మానవతా శాఖ అధ్యక్షులు తూనుగుంట్ల వెంకట సుబ్బారావు,కార్యదర్శి మందపాటి పరమానంద కుమార్,కోశాధికారి లలిత బాబు,కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు,మానవతా శాఖ డైరెక్టర్ ఆట్ల బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవే నిర్మాణంతో నిలిచిన వరద నీరు

- ఉధృతని తగ్గించుటకు జేసీబీతో రోడ్డు తొలగింపు

విశాలాంధ్ర - పర్చూరు : రోడ్డును తొలగించి తుఫాను ప్రభావంతో నీట మునిగిన ప్రాంతాలను సందర్శించి నీటి తరలింపుపై అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పలు సూచనలు చేశారు.బుధవారం పర్చూరు వాగు వరద ఉధృతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా తుఫాన్ ప్రభావంతో పర్చూరు వాగు వరద ఉధృతికి పర్చూరు,నాగులపాలెం వరదముంపుకు గురిఅయినందున చీరాల- చిలకలూరిపేట హైవేను పర్చూరు వద్ద సుమారు 10 మీటర్లు వెడల్పు మేర రెండు చోట్ల యుద్ధప్రాతిపదికన కాలువ త్రవ్వించి నీటిని దిగువకు తరలించుటకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ చర్యలు తీసుకున్నారు.పర్చూరు నుండి ఉప్పుటూరు వెళ్లే మార్గంలో పర్చూరు వాగు ఉధృతికి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నందున రోడ్డుపై ప్రజల రాకపోకలను నిషేధించాలని,కలెక్టర్ సూ చించారు.పర్చూరు వాగు ఉధృతంగా ఉందని పర్చూరు వాగు తీర ప్రాంతంలో ఉన్నటువంటి గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించాలని,పర్చూరు వాగు ప్రవాహ ఉధృతిని పొలాల్లోకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కారంచేడు తాహసిల్దార్‌కు,చీరాల డ్రైనేజీ సబ్ డివిజన్-2 ఎడబ్ల్యూఈకు ఆయన సూచించారు.వీరి వెంట పర్చూరు మండల ప్రత్యేక అధికారి లవన్న,నేషనల్ హైవే డీఈ శ్రీనివాసరావు,చీరాల డ్రైనేజీ సబ్ డివిజన్ నెంబర్-2 డిఈ మల్లికార్జునరావు,పర్చూరు తాసిల్దార్ బ్రహ్మయ్య,కారంచేడు తాసిల్దార్ నాగరాజు,డ్రైనేజీ శాఖ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు: ఎంపీడీవో

విశాలాంధ్ర - నిజాంపట్నం : మొంథా తుఫాన్ ప్రభావంతో మండల ప్రజల భద్రత కోసం ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి ప్రత్యేక చర్యలు చేపట్టారు.జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆమె మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ముందస్తు చర్యలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషించారు.తుఫాన్ హెచ్చరికలు వెలువడిన క్షణం నుంచే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోనే ఎంపీడీవో ఉంటూ పరిస్థితిని అనుక్షణం సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో గ్రామాలను సంద ర్శించి పర్యవేక్షించారు.ప్రజలను అప్రమత్తం చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు,రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో నిరంతరం సమీక్షిస్తూ వారికి ప్రత్యేక సూచనలు అందించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన కుటుంబాలకు సౌకర్యాలు,అల్పాహారం, భోజనం, తాగునీరు,వైద్య సేవలు వంటి అన్ని రకాల ఏర్పాట్లను కల్పించి పర్యవేక్షించారు. అలాగే తుఫాన్ ప్రభావిత గ్రామాలకు వెళ్లి ప్రజలకు ధైర్యం చెప్పారు.చెట్లు విరిగి రహదారులపై పడిన చోట్ల వెంటనే సిబ్బందిని పంపించి తొలగింపు చర్యలు చేపట్టించారు.లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని జెసిబిల సాయంతో తొలగించే పనులు వేగవంతం చేశారు.ప్రతి రోజు మండల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదురుకున్నారు.

చెట్లు తొలగింపు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తుఫాన్ ప్రభా వంతో ఈదురు గాలుల వలన వృక్షాలు విరిగి రహ దారిపై పడిన వాటిని ఈస్ట్ బాపట్ల గ్రామ పంచా యతీ పరిధిలోని నందిరాజుతోట,హైదర్‌పేటలో బాపట్ల ఎంపిడిఓ బి.బాబురావు పర్యవేక్షణలో రెవెన్యూతో కలసి పంచాయతీ సిబ్బంది యంత్రాల సహాయంతో రోడ్డుపై విరిగిపడిన చెట్లను తొలగించారు. కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వాణి సుమస్విత, డిజిటల్ అసిస్టెంట్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com గురువారం 30। అక్టోబరు । 2025

రైతులకు అండగా ప్రభుత్వం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - వేటపాలెం : తుఫాన్ ప్రభావంతో బాపట్ల జిల్లా తీరప్రాంతంలోని పలు ప్రాంతాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి.ముఖ్యంగా వేటపాలెం మండలం పాపయ్యపాలెం గ్రామం పరిధిలో పంట పొలాలు బాగా దెబ్బతిన్నాయి.ఈ నేపథ్యంలో బుధవారం మంత్రి గొట్టిపాటి రవి కుమార్,ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య,జిల్లా అధికారులు కలిసి గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు.వర్షాలు,గాలివానల కారణంగా మిరప, వేరుశెనగ,వరి వంటి పంటలు నేలమట్టమై రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.రైతుల పరి స్థితిని ప్రత్యక్షంగా గమనించిన ఆయన మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటల పరిస్థితిని పరిశీలిస్తున్నామని, రైతులను అన్ని విధాలుగా ఆదుకునే చర్యలు తీసుకుంటాం అని భరోసా ఇచ్చారు.అలాగే వ్యవసాయ అధికారులు తక్షణమే పంటల నష్టం అంచనా వేయాలని,బాధిత రైతులకు సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. మంత్రి,ఎమ్మెల్యే కొండయ్య పంట పొలాల్లోకి వెళ్లి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు విన్నారు.

తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు.అధికారులు పంటల నష్టం వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పులి వెంకటేశ్వర్లు (పెద్దపులి),గవిని రమేష్,జంగిలి రామారావు,మాజీ సర్పంచ్ పులి వెంకటేశ్వర్లు,పులి హరికృష్ణ, మల్లవరపు హనుమంతు,ఆతిన అంకయ్య,ఆతిన నాగరాజు,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుడికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలోని హబీబుల్లా మస్జిద్‌లో గత 15 సంవత్సరాలుగా పేష్మామంగా సేవలందిస్తున్న షేక్ హుస్సేన్ అహ్మద్ హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వస్థలానికి చేరుకున్నారు.ఈ హజ్ యాత్రకు సంబంధించిన అన్ని ఖర్చులను గ్రామానికి చెందిన దాతలు,ఆలీ-అక్తరున్నీస్సా దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుమారులు ప్రముఖ వ్యాపారవేత్తలు,అవార్డుల గ్రహీతల డాక్టర్ షేక్ రహంతుల్లా,షేక్ మునీర్ భరించి సహకారం అందించారు.

పొంగి పొర్లుతున్న నక్క బొక్కలపాడు నేలచప్ట

విశాలాంధ్ర - బల్లికురవ : తుఫాన్ నేపథ్యంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు బల్లికురవ నుండి నక్కబొక్కలపాడు మధ్యలో నేలచప్ట పొంగి పొర్లుతుంది.రాకపోకలు స్తంభించి పోయాయి.మండల అధికారులు రాకపోకలు నిలిపివేశారు.

చిన్నగంజాంను పరిశీలించిన ప్రత్యేక అధికారి

విశాలాంధ్ర - చిన్నగంజాం : మండలంలో మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న పలు ప్రాంతాలను బుధవారం బాపట్ల జిల్లా ప్రత్యేక అధికారి వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు.చిన్నగంజాం గ్రామంలో తుఫాన్ వల్ల నష్టం జరిగిన ప్రాంతం అలాగే కడవకుదురు నుండి ఇంకొల్లు వెళ్ళు రోడ్డు మార్గంలో కొమ్మమూరు బ్రిడ్జి వద్ద గోనసపూడి చింతగుంపల్లి కడవకుదురు పొలాల్లోని వరద కాలువలను అయన పరిశీలించారు.ఆయన వెంట తహసీల్దార్ జె.ప్రభాకర రావు,మండల సర్వేయర్ లోకేష్,గ్రామ సర్వేయర్, గ్రామస్తులు ఉన్నారు.

వరి పంట నేలమట్టం

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలోని మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ముక్తేశ్వరం గ్రామానికి చెందిన అడపాల బసవయ్య రెండు ఎకరాల వరి పంట నేల మట్టం అయిందని రైతు కన్నీళ్లు కన్నీటి పర్యంతమయ్యాడు.రెండు ఎకరాలకు రూ.70 వేలు పెట్టుబడిపెట్టానని తీరా చేతికి వచ్చేసరికి తుఫానుతో చేతికి వచ్చిన పంట నేలమట్టం అయిందని రైతు వాపోతున్నాడు.ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వివాహ వేడుకల్లో అశోక్ కుమార్

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలంలోని ఏల్చూరుకు చెందిన బైరెడ్డి పిచ్చిరెడ్డి వారి వివాహ వేడుకలు బుధవారం నిర్వహించారు.ఈ వేడుకలకు అద్దంకి వైసీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా నూతన వధువు లలితను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట మండల వైసీపీ నేతలు నన్నెబోయిన వెంకట సురేంద్ర,గడ్డం నర్సిరెడ్డి,బండి కోటిరెడ్డిలు ఉన్నారు.

ఇద్దరు వృద్ధులు మృతి

విశాలాంధ్ర - అద్దంకి : తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులు చలిగాలులకు పట్టణంలోని ఎన్టీఆర్ నగర్లో ఇద్దరు వృద్ధులు వనపర్తి హనుమంతరావు (80) రేకు నార్ లక్ష్మి (66) మృతి మృతి చెందారు.భారీ వర్షానికి లోతట్టు ప్రాంతమైన ఎన్టీఆర్ నగర్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో పేదలు ఇబ్బందులు పడ్డారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న భారీ వృక్షం నేల కొరిగింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

నిలిచిపోయిన వర్షపు నీరు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె ఆర్టీసీ డిపో గ్యారేజీలో చరిత్ర కలిగిన భారీ రావి చెట్టు మంగళ వారం రాత్రి కురిసిన వర్షానికి,పెనుగాలులకు కుప్ప కూలిపోయింది.ఆర్టీసీ గ్యారేజీలో మోకాల్లోతు వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ నీరును బయటకు పంపాలని గ్యారేజ్ సిబ్బంది కోరుతున్నారు.

తుఫాన్ ప్రాంతాల్లో కోన పర్యటన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తుఫాన్ ప్రభావిత ముప్పు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే,మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పర్యటించారు.మండలం పంచాయతీ పరిధిలోని సూర్యలంక గ్రామంలో తుఫాను ప్రభావానికి గురైన గ్రామ ప్రజలను ఆయన పరామర్శించారు.నీట మునిగిన ఇళ్లను,ఆ ఇళ్లలో ఉన్న కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిలో మనోధైర్యాని కల్పించారు.సూర్యలంక తుఫాను రక్షిత భవనంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి,అక్కడ ఆశ్రయం పొందుతున్న బాధితులతో మాట్లాడారు.కూటమి ప్రభుత్వంలో ప్రజల అవసరాలను పట్టించుకునే నాథుడే లేడని ఆయన సమక్షంలో బాపట్ల పట్టణ 11వ వార్డు ప్రజలు వాపోయరన్నారు.ప్రభుత్వం వరద తీవ్రతతో నష్ట పోయిన ప్రతి ఒక్కరిని ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట బాపట్ల పట్టణ వైయస్సార్సిపి అధ్యక్షులు కాగిత సుధీర్ బాబ,వైఎస్ఆర్సిపి పార్టీ వికలాంగుల జిల్లా అధ్యక్షుడు చల్లారామయ్య, వైయస్సార్సిపి యువ జన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య,వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి పేర్లి రంజిత్ అభిమానులు,అడవి పంచాయతీ వైఎస్ఆర్సిపి పార్టీ ప్రెసిడెంట్ కొక్కిలిగడ్డ ఏడుకొండలు,వైస్ ప్రెసిడెంట్ సింగోతి శ్రీనివాసరావు,సంఘని సురేష్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

మంత్రులు కొలుసు, గొట్టిపాటి

విశాలాంధ్ర - బాపట్ల : తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులను ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా ఇంచార్జీ మంత్రి కొలుసు పార్థసారథి,విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో తుఫాను వల్ల దెబ్బతిన్న వరి, మిర్చి పొలాలను వేమూరు బాపట్ల ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, వేగేశన నరేంద్రవర్మలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాను తీవ్రత తగ్గిపోయిందని నష్టపోయిన రైతుల పంట వివరాల అంచనాలు తయారు చేయవలసిందిగా వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. తుఫాను ప్రభావం వల్ల పడిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపారం పరిహారం అందించ డానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తుఫాను వల్ల దెబ్బ తిన్న గృహాల యజమానులకు నష్ట పరిహారం అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల నష్టాలను అంచనా వేయడానికి అధికార బృందాలను పంపిస్తామని ఆయన చెప్పారు. అడివిపల్లిపాలెం గ్రామంలో మత్స్యకారులకు అవసరమైన గృహ నిర్మాణాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఇప్పటికే సొంత స్థలాలు కలిగిన మత్స్యకారులకు వెంటనే గృహాలు మంజూరు చేస్తామని చెప్పారు. మత్స్యకారులకు పి.ఎం.ఏ.వై 2.0 పథకం క్రింద గృహాలు మంజూరు చేస్తామని చెప్పారు. జిల్లాలో తుఫాను వల్ల 100 విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయాని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామ న్నారు. అద్దంకి గుండ్లకమ్మ నదిలో నీటిని విడుదల చేయడానికి ముగ్గురు సిబ్బంది ప్రాజెక్టు వద్దకు వెళ్లారని ప్రమాదవశాత్తు గేట్లలో ఇరుక్కుపోయారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి. గ్లోరియా, బాపట్ల తాసిల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను ఎస్సై పరిశీలన

విశాలాంధ్ర - చెరుకుపల్లి : తుఫాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షత ప్రాంతాలకు తరలించి ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది.ఈ కేంద్రాలలో భోజన వసతి, అల్పాహారం, విద్యుత్తు, తాగునీరు, ప్రాథమిక చికిత్స కేంద్రాలు తదితర సౌకర్యాలు వారికి ఏర్పాటు చేయడం జరిగింది.ఎస్సై టి.అనిల్ కుమార్ బుధవారం పునరావాస కేంద్రాలను సందర్శించి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పునరావాస కేంద్రాలను సందర్శించిన నర్రా

విశాలాంధ్ర - నిజాంపట్నం : మొంథా తుఫాన్ ప్రభావంతో నిజాంపట్నం,ఆముదాలపల్లి పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బుధవారం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య సందర్శించారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం యువజన బాపట్ల జిల్లా అధ్యక్షుడు పచ్చపట్ల గంగరాజు,నిజాంపట్నం పీఏసీఎస్ అధ్యక్షులు నరేష్ యాదవ్,మండల తెలుగు యువత అధ్యక్షుడు పందరబోయిన శ్రీనివాసరావు, బీసీ సంఘం యువజన నాయకులు నర్రా సునీల్,టీడీపీ టౌన్ అధ్యక్షులు ఖాదర్ బాబు,టీడీపీ కార్యకర్త కన్నేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్టూరులో తుఫాన్ బీభత్సం

విశాలాంధ్ర - మార్టూరు : తుఫాను తీవ్రతకు మండలంలోని రైతులు, జనజీవనం పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయింది.దేగరమడి గ్రామంలో వాగు నీటి ప్రవాహంతో జాతీయ రహదారితో రాకపోకలు ఆగిపోయి.అదే గ్రామంలోని ఆదర్శనగర్ కాలనీలోని ఇళ్లలోకి ప్రవేశించిన నీటిని బయటకు పంపలేక ఇబ్బందులు పడుతున్నారు.సమస్యను అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి: మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర - అద్దంకి : తుఫాన్ సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.మండలంలో భారీ వర్షం కురిసిన నేపథ్యంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.తుఫాన్ ప్రభావంతో విరిగిపడిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్తును పునరుద్ధరించాలన్నారు.గ్రామాలలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు.తాగునీరు క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. శానిటేషన్‌కు సంబంధించి మున్సిపాలిటీలో అవసరమైతే అదనంగా సిబ్బందిని నియమించాలన్నారు. తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర,ఎంపీడీవో వరాధిని,ఎలక్ట్రిసిటీ ఈఈ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

20 మందిని కాపాడిన అధికారులు

విశాలాంధ్ర - పర్చూరు : తుఫాను ప్రభావంతో పర్చూరు జలమయమైనది.స్థానిక గుంటూరు రోడ్‌లోని పర్చూరు వాగు ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది.వాగు సమీపంలో ఉన్న ప్రార్థన మందిరంలో 20 మంది ప్రార్థనకు వెళ్లి వరదలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ,పోలీస్ అధికారులు వారి వద్దకు చేరుకొని వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణికి ప్రాణ రక్షణ

విశాలాంధ్ర - ఇంకొల్లు : తుఫాన్ బీభత్సం మధ్యలో మానవత్వం మళ్లీ విజయం సాధించింది.బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జరుగుతున్న తుఫాన్ సహాయక చర్యల్లో భాగంగా,ఇంకొల్లు మండలం పోలీసులు ప్రాణాలను పణంగా పెట్టి నిండు గర్భిణీ ప్రాణాలను కాపాడారు.ఇంకొల్లు మండలం కొణికి గ్రామ పంచాయతీ పరిధిలోని కట్టవారిపాలెం గ్రామానికి చెందిన టీ.కీర్తి అనే గర్భిణీకి బుధవారం తెల్లవారుజామున ప్రసవ నొప్పులు మొదలయ్యాయి.అయితే మొంథా తుఫాన్ కారణంగా వాగులు ఉప్పొంగి,గ్రామానికి రహదారి పూర్తిగా తెగిపోయింది.108 అంబులెన్స్ గ్రామానికి చేరుకోవడం అసాధ్యం కావడంతో పరిస్థితి విషమించింది.ఈ విషయం తెలిసిన వెంటనే ఇంకొల్లు ఎస్సై జి.సురేష్ తన సిబ్బంది మహిళా పోలీసు అధికారి ప్రియ,ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ 243 బ్రహ్మేశ్వరి,హెచ్.సి 612 రామకృష్ణలతో కలిసి ఆ గ్రామానికి చేరుకున్నారు.అంగన్వాడీ కార్యకర్త సహాయంతో వారు గర్భిణీని పోలీసు జీపులో ఉంచి,ఉప్పొంగిన వాగును దాటి ప్రమాదాన్ని లెక్కచేయ కుండా సురక్షితంగా ఇంకొల్లులోని విజయలక్ష్మి ఆసుపత్రికి తరలించారు.వైద్యాధికారి డాక్టర్ అంజలి పర్యవేక్షణలో చికిత్స అందించగా,కీర్తి ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఎస్సై సురేష్,ఆయన బృందం నిజమైన ప్రజాసేవకులు అభినందనీయమని ప్రశంసించారు.

వరద బాధితులను పరామర్శించిన సీపీఐ

విశాలాంధ్ర - ఒంగోలు : సంతనూతలపాడు నియోజకవర్గం ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 41 డివిజన్ సరళ దేవినగర్ కేంద్రంలో ఉన్న వరద బాధితులను సీపీఐ నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వార్డ బాధితులకు సీపీఐ నాయకులు ధైర్యం చెప్పారు. రుతుపరంగా అందాల్సిన పరిహారం, ముఖ్యఅసలు వస్తువులు అందరికీ అందేలా పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. సంత నూతల పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నల్లూరి మురళి, సంతనూతలపాడు మండల సిపిఐ కార్యదర్శి ముత్తన అంజయ్య, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ నాయకులు బంగారయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సీపీఐ అండ

నిత్యవసరాలు పంపిణీ చేయాలి

సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీనివాస్

విశాలాంధ్ర -ఒంగోలు : ఒంగోలు నగరంలోని శివారు కాలనీల ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, వరద నీరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, అలాగే నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని, శివారు కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని సీపీ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలులోని పలు శివారు కాలనీలను సీపీఐ ఒంగోలు నగర బృందం బుధవారం పరిశీలించింది. ఒంగోలు రెండవ డివిజన్లో గుంటూరు రోడ్ లోని ఎంఎన్ఆర్ కేన్సర్ హాస్పటల్ పక్కన గల కార్మిక నగర్ నడుము లోతు నీరులో మునిగిన పరిస్థితిని గమనించి సీపీఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు కాలనీకి సందర్శించి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన అధికారులు జెసిపి తెప్పించి గండి పడిన కాలువలకు మరమ్మతులు చేయించి నీళ్లు రాకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 18 సంవత్సరాలు దాటుతున్న కాలనీలో ఇప్పటివరకు ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు నోచుకోలేదన్నారు. కాలనీ ఏర్పడి 18 సంవత్సరాల ఎంత వరకు ఇలాంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. కరెంటు స్తంభాలు పాతినపటికి వీధిలైట్లు కూడా వేయలేదన్నారు. కాలనీలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నాయని, వరదల కారణంగా దాదాపు సగం మంది కాలనీవాసులు పునరావాస కేంద్రాలు ఆశ్రయించగా, మిగిలినవారు ఎటు పోవాలో దిక్కుతోచని స్థితిలో కాలనీలో చేరిన నీటిలోనే ఉన్నారన్నారు. విద్యుత్ స్తంభాలు పాతి ఇంతవరకు వీధిలైట్లు కూడా ఇవ్వలేదని కాలనీలో సుమారు 150 కుటుంబాలు ఉన్నాయని రాత్రి కొంతమంది పునరావాస కేంద్రాలకు వెళ్లిపోయారని మరి కొంతమంది ఎటు పోలేక వరద నీటిలోని ఇళ్ల వద్దే ఉన్నారన్నారు. సర్వం కోల్పోయి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ఆదుకోవాలని, పరిహారం అందించాలని, నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని కోరారు.

కంభం చెరువు నుండి పారుతున్న అలుగు

విశాలాంధ్ర -కంభం : మొంత తుఫాన్ తో కురిసిన వర్షాలకు కంభం చెరువుకు 21 అడుగులు నీరు చేరి అలుగు పారుతుంది. దీంతో గత ఐదుఏళ్లుగా కంభం చెరువులో నీళు ఒక మోస్తరుగా ఉండటంతో పంటపొలాలకు నీళ్లు లేక చెరువు ఆయకట్టు కింద రైతులు పంటలు వేయలేదు.బుధవారం అలుగు పారడంతో పట్టణవాసులు అలుగు చూసేందుకు తండోపతండాలుగా, కుటుంబ సమేతం గా వచ్చి చూస్తున్నారు. పహారకాస్తున్న పోలీసులు : కంభం చెరువు నిండి ఉండటంతో యువకులు వచ్చి స్నానాలు చేయటం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు .కంభం చెరువు వద్ద,అలుగువద్ద రైల్వే బిర్జ్ సమీపంలోని అలుగు వద్ద యువకులు వచ్చి నీటిలో దిగి స్నానాలు చేయటం ,సెల్ఫీలు తీసుకోవటం చేస్తున్నారు .అన్ని చోట్ల పోలీస్ లు పహారా కాసి ఎవరికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ,డిఎస్పీ ,ఆదేశాలమేరకు సీఐ మల్లికార్జున ,ఎస్సై నరసింహారావు పోలిసులతో పర్యవేక్షిస్తున్నారు.

నీట మునిగిన ఎస్సీ కాలనీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మొంతా తుఫాను ప్రభావంతో గత మూడు రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రమైన కొనకనమిట్ల ఎస్సీ కాలనీ నాగరాజు కుంట ఎస్సీ కాలనీ ఎదురుపడే శి కాలనీ వెలుగొండ్రాయినిపల్లి ఎస్సీ కాలనీ పాతపాడు నాయుడుపేట ఎస్సీ కాలనీలకు నీరు చేరడంతో వారిని గ్రామాల్లోని పాఠశాలలో లోని పునరావాస్ కేంద్రాలకు తరలించారు వాగులు వంకలు పొంగిపొర్లు ఉన్నాయి. సహాయక చర్యలు చేపట్టి మండల ప్రత్యేక అధికారి సువార్త, ఎంపీడీవో ఈశ్వరమ్మ, తాసిల్దార్ ఆవుల సురేష్, వ్యవసాయ అధికారి కే ప్రకాష్ రావులు అన్ని గ్రామాల వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల సిబ్బంది ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. మండలంలోని వద్దిమడుగు తువ్వపాడు చినమనగుండం పెదారికట్ల గ్రామాల్లో చెరువులకు నీరు చేరింది .చింతకుంట్ల గ్రామానికి చెందిన వసంతపురము వెంకట చెన్నయ్య మద్యం మత్తులో గ్రామ సమీపంలో ఉన్న వాగులో దిగగా అప్రమత్తమైన సచివాలయ సిబ్బంది గ్రామస్తులు కాపాడి గొడ్డుకు చేర్చారు. మరిపాలెం సమీపంలో రోడ్డుకు అడ్డుపడ్డ విద్యుత్ స్తంభాన్ని అధికారులు తొలగించే తొలగించారు .ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు వచ్చేవరకు అధికారులు సచివాలయ ,సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు అన్ని గ్రామాల్లో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.

మోపాడు రిజర్వాయర్‌కు జలకళ

విశాలాంధ్ర-పామూరు : మొంథా తూఫాన్ కారణంగా వర్షాలు పడినందున మన్నేరు నాసాగు ద్వారా మోపాడు చెరువుకు 15 అడుగులకు వరద నీరు చేరింది. బుధవారం మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్యతో కలిసి కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, పామూరు పట్టణ టిడిపి అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, పట్టణ ఉపాధ్యక్షులు ఇద్రి కోటిరెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు కావేరి రసూల్ తదితరులు రిజర్వాయర్ ను పరిశీలించారు.

బాధిత కుటుంబాలకు చేయూత

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు చేయూతగా మండలంలోని మద్దిరాలపాడు గ్రామ నివాసి, ఎన్.ఆర్.ఐ. సుబ్బరాయుడు శారద ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టి పేదలకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నెప్పల సుబ్బరాయుడు సోదరులు నెప్పల ప్రభుదాసు, నెప్పల నాగేశ్వరరావు, ముప్పవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడిన అధికారులు

విశాలాంధ్ర-పొన్నలూరు : పొన్నలూరు, ఉప్పలదిన్నె పోయే రోడ్డు మార్గంలో ఉన్న గొలుసు లేరు వాగు దాటే క్రమంలో జరుగుమల్లి పచ్చవ గ్రామానికి చెందిన నూతలపాటి కోటయ్య తన ద్విచక్రవాహంపై వాగు దాటబోతుండగా వేగంగా వస్తున్న నీటి ప్రవాహం తాకిడికి బైక్ అదుపుతప్పి వాగులో కొట్టుకుపోతు సమీపంలో ఉన్న ఒక యాప చెట్టును ఆసారాగా పట్టుకొని చెట్టు ఎక్కి రాత్రంతా చెట్టుపైనే బిక్కుబిక్కుమంటూ గడిపాడు. ఉదయాన్నే స్థానికులు గమనించి పోలీసులకు అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు రోప్ సహాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించారు.

గుండ్లకమ్మ నదిలో చిక్కుకున్న మునిసిపల్ కార్మికులు

విశాలాంధ్ర - అద్దంకి : తుఫాన్ ప్రభావం కారణంగా అద్దంకిలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వరద ఉధృతికి గుండ్లకమ్మ నదిలో అద్దంకి పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పంపు హౌస్‌లో ముగ్గురు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వరదలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర,సీఐ సుబ్బరాజు సంఘటన స్థలానికి చేరుకొని వారిని బయటికి తెచ్చేందుకు గజ ఈతగాళ్లను పడవలో పంపించారు. పడవలో వారిని తీసుకువస్తుండగా ప్రమాదవశాత్తు పడవ బోల్తా పడింది. బోల్తా పడిన పడవ నుంచి ఆరుగురు చెట్లు ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో చీరాల డీఎస్పీ మోయిన్ రంగంలోకి దిగారు. మత్స్యకారుడు బందారు పవన్ కుమార్‌ను పడవలో పంపించి ఒక్కొక్కరిని ఒడ్డుకు తీసుకువచ్చారు. 6 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి ఆరుగురిని క్షేమంగా తీసుకువచ్చిన అధికార బృందాన్ని,మత్స్యకారుడు పవన్ కుమార్‌ను బాధిత కుటుంబ సభ్యులు అభినందించారు.

రైల్వే సిబ్బందిని కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర - చిన్నగంజాం : ప్రాణాలను పణంగా పెట్టి రైల్వే సిబ్బందిని రక్షించిన స్థానిక పోలీసులు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్ నుంచి డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఇద్దరు రైల్వే ట్రాక్‌మెన్ గణేష్,బాలాజీ రెడ్డిలు తమ బైక్‌పై ప్రయాణిస్తుండగా, ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్-నీలాయపాలెం మధ్యలో ఉన్న అండర్‌పాస్ వద్ద అకస్మాత్తుగా నీటి వరద ప్రవాహం ఎదురైంది. ప్రవాహం తీవ్రంగా ఉండడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు సిబ్బంది నీటిలో కొట్టుకుపోయే ప్రమాదంలో పడ్డారు. ఈ ఘటనను అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసులు అన్సార్ భాష,శివశంకర్ రెడ్డి గమనించారు. రైల్వే సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న వారు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా,తక్షణమే అక్కడికి చేరుకుని,తాడు సహాయంతో రక్షా ప్రయత్నాలు చేపట్టి ఆ ఇద్దరినీ నీటి ప్రవాహం నుండి సురక్షితంగా కాపాడి బయటకు తీశారు. ప్రమాదం నుంచి బయటపడ్డ గణేష్,బాలాజీ రెడ్డి పోలీసుల ధైర్యసాహసానికి కృతజ్ఞతలు తెలిపారు.

తుఫాన్ దెబ్బకు రైతులు అతలాకుతలం

విశాలాంధ్ర-కొల్లూరు : మొంథా తుపాను దాటికి రైతులు అతలాకుతలం అయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో కొల్లూరు మండలపరిధిలో మంగళవారం రాత్రి నుంచి వీచిన పెనుగాలులకు వరి, వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని కొల్లూరు, దోనేపూడి, చినపులివర్రు, తాడిగిరిపాడు, రావికంపాడు, బొద్దులూరుపాడు, మోసలిపాడు, క్రాప, అనంతవరం, ఈపూరు, చిలుమూరు గ్రామాల పరిధిలో 10, 800 ఎకరాలలో రైతులు వరి సాగు చేపట్టారు. తుపాను గాలుల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటకు 7, 100 ఎకరాల విస్తీర్ణంలో నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. గాలులతో కూడుకున్న భారీ వర్షం కారణంగా కోత దశకు వచ్చిన వరి పంట నేలవాలి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఎకరాకు కౌలు మినహాయించి రూ. 25 వేల వరకు పెట్టుబడులు రూపంలో వెచ్చించిన రైతాంగానికి మొంథా తుపాను విపత్తు కారణంగా రూ. కోట్లలో నష్టం వాటిల్లడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. తుపాను కారణంగా బలమైన గాలుల కారణంగా మండలంలోని లంక గ్రామాలలో సాగైన వాణిజ్య పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ప్రధానంగా అరటి సాగు చేసిన రైతులకు మొంథా తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గాలుల దాటికి మండలంలోని పలు గ్రామాలలో సాగైన 667 హెక్టార్లలో అరటి పంట నేల కూలడంతో రైతాంగానికి రూ. కోట్లలో నష్టం వాటిల్లింది. అరటితో పాటు, కూరగాయల పంటలు 20 హెక్టార్లలో, తమలపాకు 38 హెక్టార్లు, బొప్పాయి 6 హెక్టార్లలో నష్టపోయినట్లు ఉద్యానవన శాఖాధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. తుపాను కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తుపాను గాలుల కారణంగా మండల వ్యాప్తంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గాలులకు రేపల్లె - తెనాలి ప్రధాన రహదారితోపాటు, ఇతర మార్గాలలో విద్యుత్తు తీగలు తెగి పడటంతోపాటు, చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారులలో కూలిన చెట్లను అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించి రాకపోకలను పునరుద్ధరించడంతో ప్రయాణికులు రాకపోకలు సజావుగా సాగడానికి మార్గం సుగమమం అయ్యింది.

అధికారుల సమన్వయంతో నష్టం తగ్గించాం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు, కలెక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : అధికారులందరూ సమన్వయంతో మొంథా తుపాను ప్రభావం నుండి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారని బాపట్ల జిల్లా ఇంచార్జీ మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. చీరాల - పర్చూరు మార్గంలో రొంపేరు కుడి మేజర్ కాలువను, పర్చూరు వాగు ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలసి మంత్రి, కొలుసు పార్థసారథి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాన్ నుండి ప్రజలను రక్షించటలో నష్టాన్ని తగ్గించటలో ప్రాణ నష్టం లేకుండా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, అధికారులందరూ సమన్వయంతో పని చేశారని ఆయన తెలిపారు. పర్చూరు వాగు ఊహించని రీతిలో ప్రవహిస్తూ పర్చూరు, నాగులపాలెంను వరద నీటితో చుట్టుముట్టిందని ఆయన తెలిపారు. పర్చూరు వాగు సామర్థ్యం 5500 క్యూసెక్కులు మాత్రమేనని ఆయన తెలిపారు. పల్నాడు, చిలకలూరిపేట, అద్దంకిలో కురిసిన వర్షం కారణంగా పర్చూరు వాగులో 9 నుండి 11వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి రాకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఉమామహేశ్వరరావు, డ్రైనేజీ శాఖ అధికారులు, నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు భోజనాల ఏర్పాటు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మొంథా తుఫాన్ ప్రభావంతో సంతమాగులూరు మండలంలోని పలు కాలనీలను వరదనీరు చుట్టుముట్టాయి. నివాస యోగ్యంకాని కాలనీవాసుల కోసం బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు మేరకు తహశీల్దార్ కె.రవిబాబు ఆధ్వ ర్యంలో ఏల్చూరు, కుందుర్రు,కొమ్మాలపాడు తదితర గ్రామాల్లో పునరావాస కేంద్రాలుగా ప్రభుత్వ పాఠశాలలను కేటాయించి,వసతి ఏర్పాటు చేశారు. గత రెండు రోజుల నుంచి పునరావాస కేంద్రంలో ఉన్న నిర్వాసితులకు భోజనం,అల్పాహారం కల్పిస్తున్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు కూడా ముందుకు వచ్చారు. సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ తేల్లప్రోలు రమేష్,ఎస్సై ఎం.పట్టాభి రామయ్య, సర్పంచ్ మందా సూరిబాబు,డీసీ వైస్ ప్రెసిడెంట్ వల్లెం నాసరయ్య,టీడీపీ నేతలు దుద్దేల చిన్న గాలెయ్య,నక్కా వెంకటేశ్వర్లు, సంతమాగులూరు మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొలిశెట్టి మస్తాన్ రావు పునరావాస కేంద్రాలను సందర్శించారు.

మొక్కజొన్న,వరి,మినుము పంటలకు భారీ నష్టం

విశాలాంధ్ర - అద్దంకి : తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న వరి మినుము పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణ బుధవారం మండలంలో పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలో 500 ఎకరాల్లో మొక్క జొన్న,200 ఎకరాల్లో వరి, 115 ఎకరాల్లో మినుము పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంటల నష్టం నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

ఉద్యాన పంటల నష్టం అపారం

విశాలాంధ్ర - సంతమాగులూరు : తుఫాన్ ప్రభావంతో సంతమాగులూరు మండలంలో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని మార్టూరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి బి.హనుమంత్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆయన బొప్పాయి, మిర్చి,పండ్లు,కూరగాయల తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 250 ఎకరాల్లో పంట నష్టం కింద ప్రాథమిక నివేదిక సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మక్కెనవారిపాలెం, కొమ్మాలపాడులోని మిర్చి పొలాల్లో వర్షపునీరు నిలిచింది.